క్లుప్తంగా

రెవెన్యూ కార్యాలయం సందర్శన



హసన్‌పర్తి: సాదా బైనామా క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఆర్డీఓ వెంకటేష్ తెలిపారు. హసన్‌పర్తి రెవెన్యూ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను సరిచూశారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రహీం, సీనియర్ అసిస్టెంట్ రజనీకాంత్, ఆర్ఐ ఫాజిల్ ఉన్నారు.

రూ.6 వేల వేతనం ఇవ్వాలి

నయీంనగర్: గ్రామ పూజారులకు ధూపదీప నైవేద్యం కింద ప్రభుత్వం రూ.6 వేల వేతనం ప్రకటించాలని జగదాంబ మేడారం భద్రకాళి పూజారుల సంఘం జాతీయ గౌరవ అధ్యక్షుడు కుడికల ఆంజనేయులు కోరారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పూజారులకు గుర్తింపు పత్రాలను మంజూరు చేయాలని, ప్రభుత్వమే స్థలం కేటాయించి గుడి కట్టించి ఇవ్వాలని సూచించారు. బ్రాహ్మణులతో సమానంగా సముచిత గౌరవం కల్పించి, దేవాదాయ శాఖలో ఉద్యోగావకాశాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

శైలజకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పోకల శైలజకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ (జేఎన్‌టీయూ) డాక్టరేట్ ప్రకటించింది. నోవెల్ సెక్యూర్ మల్టీపాత్ రోటింగ్ ఆల్గారిథం ఫర్ మొబైల్ అడహక్ నెట్‌వర్క్స్ (మ్యానెట్స్) అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శైలజకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు జేఎన్‌టీయూ డైరెక్టర్ డాక్టర్ అరుణకుమారి తెలిపారు. అనంతసాగర్‌లోని ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ సివి గురురావు పర్యవేక్షణలో శైలజ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

సర్వాయి పాపన్న జయంతి వేడుకలను నిర్వహించాలి

హన్మకొండ: సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఈనెల 18న గ్రామగ్రామాన ఘనంగా జరుపుకోవాలని సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ వల్లకొండ వేణుగోపాల్ సూచించారు. పాపన్న జయంతి రోజును ప్రభుత్వం సెలవు ప్రకటించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 18న రవీంద్రభారతిలో అధికారికంగా నిర్వహించనున్న పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి గౌడ, బీసీ, ఎస్సీ, ఎస్టీలు తరలిరావాలని కోరారు.

యువతి అదృశ్యం

రామన్నపేట: వరంగల్ డీఎంహెచ్‌ఓ కార్యాలయ సమీపంలోని సత్యసాయి అపార్ట్‌మెంట్‌లో నివాసముండే 26 సంవత్సరాల యువతి కందగట్ల సునీత అదృశ్యమైనట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. యువతి తండ్రి సురేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. యువతి శుక్రవారం ఉదయం 10గంటలకు వెళ్లి తిరిగి రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి ఎస్ఆర్ఆర్ తోటలో ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్‌తోటలో చెందిన కంచి దేవరాజు, పావని పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే గురువారం రాత్రి ఇంట్లో భోజనం చేసి నిద్రించిన దేవరాజు శుక్రవారం తెల్లవారుజామున కనిపించలేదు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీలేదు. ఈనేపథ్యంలో కంచి పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మడికొండ శివారు సోమిడిలో చోటు చేసుకుంది. మడికొండ ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన కాగిత రాంచందర్ (37) ఆర్థిక ఇబ్బందులతో గురువారం ఉదయం సోమిడి శివారులో క్రిమిసంహారక మందు తాగి పడిపోయాడు. స్థానికులు వెంటనే గమనించి చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడి తండ్రి అయిలయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంగు ఉపేంద్రశర్మకు సన్మానం

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దేవాలయంలో ఆలయ సిబ్బంది ఆయనను శుక్రవారం సన్మానించారు. దేవాలయ అర్చకులు సందీప్‌శర్మ, శ్రవణ్‌కుమార్ దేవాదాయ శాఖ సిబ్బంది రామకృష్ణ పాల్గొన్నారు.

వామ్మో మూడు బాటలు..

- మలుపుల వద్ద మేక తలలు
- క్షుద్ర పూజలతో ప్రజల బెంబేలు
- కొబ్బరికాయలపై దూసుకెళ్లి ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



బందం రోడ్డు, హరిత నగర్‌లో కొబ్బరికాయ, కోడిగుడ్లు (ఫైల్)



రోడ్డుపై క్షుద్ర పూజల ఆనవాళ్లను తొలగిస్తున్న అమ్మ అశోక్, తదితరులు

హన్మకొండ (పరకాల) : రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికయుగంలో కొందరు స్వప్రయోజనాల కోసం మూఢ నమ్మకాలను నమ్మిస్తూ అమాయకులతో చెలగాటం ఆడుతున్నారు. అనారోగ్యం బారిన పడితే వైద్యుడిని ఆశ్రయించాల్సిన కొందరు మాంత్రికుల మాయలో పడి ఇబ్బందుల్లో పడుతున్నారు. పరకాల పట్టణంలోని మూడు బాటల వద్ద కొంత కాలంగా పెరుగుతున్న క్షుద్ర పూజలపై పట్టణ ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఒకప్పుడు కోడిగుడ్లు మాత్రమే కనిపించగా ప్రస్తుతం నల్ల కోళ్లు, మేక తలలు మూడు బాటల వద్ద దర్శనమిస్తున్నాయి. రోడ్డు మార్గాల వెంట నడవాలంటే ప్రజలు వణికిపోతున్నారు. బీసీ కాలనీ రోడ్డు, బందం రోడ్డు, సీఎస్ఐ పాఠశాల సమీపం, హరితనగర్ రోడ్డు, శివాలయంరోడ్డు, బుడిగజంగాల కాలనీ రోడ్డు, కొత్త మున్సిపాలిటీ రోడ్డులో ప్రతి రోజు క్షుద్ర పూజల ఆనవాళ్లు కనిపిస్తుంటాయని, కొబ్బరికాయ, ఇతర వస్తువులను గమనించని ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

హెల్మెట్ లేకపోతే చనిపోయేవాడిని

నెలరోజుల క్రితం రాత్రి సమయంలో లక్ష్మీపురం వెళ్తుండగా మూడు బాటల వద్ద పెట్టిన కొబ్బరికాయపై నుంచి బైక్ దూసుకెళ్లడంతో కిందపడ్డాను. దీంతో స్వల్ప గాయాలు అయ్యాయి. హెల్మెట్ ఉండటంతో బతికిపోయాను. క్షుద్రపూజలు చేసే వారిని అధికారులు వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలి.

- మంగళ్లపల్లి రవి, లక్ష్మీపురం

భయాన్ని తొలగిస్తున్నాం

పరకాల పట్టణంలో క్షుద్ర పూజల పేరిట మూడు బాటల వద్ద కొబ్బరికాయలు ఉంచుతున్నారు. గమనించకుండా బైక్‌పై వెళ్తున్న ఇద్దరు మిత్రులు కిందపడి గాయపడ్డారు. దీంతో అక్కడకు వెళ్లి ఆనవాళ్లను తొలగించాను. మూఢ నమ్మకాలను రూపుమాపేందుకు గ్రామాల్లోని ప్రజలను చైతన్య పరుస్తున్నాం.

- అమ్మ అశోక్, సామాజిక సేవకుడు

అటెన్షన్ ప్లీజ్

గుంతలరోడ్డుతో గాయాలు



ఐనవోలు : మండల కేంద్రం నుంచి పున్నేలు క్రాస్‌కు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారింది. రెండు మలుపుల వద్ద గుంతలు ఏర్పడడంతో వరదనీరు నిలిచి గుంతలు కనిపించడం లేదు. దీంతో ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. గుంతలు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : రాజు, ఆర్అండ్‌బీ, ఏఈ
ఫోన్‌నంబర్ : 9642148659

కేటీఆర్ మహిళలకు క్షమాపణ చెప్పాలి



శాయంపేట : కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తిలో..

శాయంపేట : తెలంగాణ రాష్ట్ర మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. మహిళలపై కేటీఆర్ చేసిన వాఖ్యలు సిగ్గుచేటని మండిపడ్డారు.

ఎల్కతుర్తి : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఈ మేరకు మండల కేంద్రంలోని హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంపై ఆయన చేసిన వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల ప్రాంగణంలో మంగపేట ఎంజేపీ విద్యార్థులు పరిమితికి మించి ఉండడం వలన అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని దళిత సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులను పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుని విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ముందుండాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్, నాయకులు విజయ్, క్రాంతికుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



శాయంపేట : మండల కేంద్రంలోని శివ మార్కండేయ, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో, మత్స్యగిరి స్వామి ఆలయంలో శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్, ఆరుట్ల కృష్ణమాచార్యులు నిర్వహించారు. గణపతి పూజ, శ్రీమహాలక్ష్మీదేవి అష్టోత్తరాలు, కలశారాధన పూజలు నిర్వహించి దాని విశిష్టతను తెలిపారు. పూజ అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్లు బాసాని సూర్యప్రకాశ్, సామల భిక్షపతి, మహిళలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మడికొండ: మడికొండ ఎస్సై రాజబాబు ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్‌లోని తేజస్వి అప్పెరల్ పార్కులో మహిళా కార్మికులకు సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజబాబు మాట్లాడుతూ సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. సైబర్ మోసగాళ్ల వలలో పడొద్దని అన్నారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలని ఎస్సై సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి

- ఏఓ శ్రీనివాస్



ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు చేస్తున్న ఏఓ శ్రీనివాస్

నడికూడ : మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ఎరువులు, పురుగుమందులను ఎమ్మార్పీకే విక్రయించాలని ఏఓ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండంలోని రామకృష్ణపూర్, కంఠాత్మకూర్, నడికూడ గ్రామాల్లో గల ఫర్టిలైజర్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురుగు మందులను, రికార్డులను, క్యూ ఆర్ కోడ్‌లను, లేబుల్స్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎరువులను ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులకు విధిగి రశీదు ఇవ్వాలని సూచించారు. నకిలీ మందులకు తావు లేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



బాధితులకు చెక్కులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ సమ్మిరెడ్డి

వేలేరు : రాష్ట్రంలోని నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంగా నిలుస్తోందని మాజీ ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి అన్నారు. హనుమకొండలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో శుక్రవారం మండలంలోని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన గాదె శ్రీనివాస్‌రెడ్డికి రూ.60వేలు, రాచకొండ నర్సయ్యకు రూ.44 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా ఆయన అందించారు. ఈ సందర్భంగా సమ్మిరెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్యం బారిన పడిన బాధితులు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందారని, ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరినట్లు తెలిపారు. స్పందించిన ఆయన సీఎంఆర్‌ఎఫ్ ద్వారా చెక్కులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోదెల రాజిరెడ్డి, నాయకులు రవీందర్, ఉమారెడ్డి పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్కతుర్తి : ఇచ్చిన మాటకు కట్టుబడి ఏకకాలంలో రూ. 2లక్షల రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసినందుకు కృతజ్ఞతగా శుక్రవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ అంటేనే మాటకు కట్టుబడి ఉండే పార్టీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుకినె సంతాజీ, గొర్రె మహేందర్, శీలం అనిల్‌కుమార్, హింగె శ్రీకాంత్, బచ్చు బాబురావు, తంగళ్లపల్లి రమేశ్, రత్నాకర్‌రావు, పాక రమేశ్ శనిగరం వెంకటేశ్, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో సింహమాస సంక్రమణ పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఒగ్గు పూజారులు



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఐనవోలు : సూర్యుడు కర్కాటక రాశి నుంచి సింహరాశిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా శుక్రవారం ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నిత్య పూజల అనంతరం స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం నిర్వహించారు. గొల్లకేతమ్మ, బలిజమేడలమ్మతో శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం జరిపించారు. అదే విధంగా ఒగ్గు పూజారులు పెద్దపట్నం వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమశర్మ, ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చక సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

వేలేరు : మండలంలోని పీచర క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై సురేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపినా, సరియైన పత్రాలు, లైసెన్స్ లేకపోయినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్స్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

అవకతవకలపై విచారణ చేయాలి

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో రుణాల మంజూరు, నిధుల వినియోగంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని పీఏసీఎస్ డైరెక్టర్లు కోరారు. ఈ మేరకు డైరెక్టర్లు నత్తి సుధాకర్, కంచ సతీశ్, రేవూరి జయ్‌పాల్‌రెడ్డి, దుగ్యాల శ్రీను, ఓరుగంటి గోవర్ధన్‌రెడ్డి పలువురు రైతులు నోడల్ అధికారి విజయ్‌భాస్కర్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. పీఏసీఎస్ చైర్మన్ రవీందర్ రుణాల మంజూరు చేసేందుకు రైతుల నుంచి నగదు తీసుకున్నారని ఆరోపించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరారు.

విద్యార్థులకు నగదు పురస్కారాల ప్రదానం



శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన ఇరువురు విద్యార్థులు ఇంటర్, పదోతరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చగా శుక్రవారం కృపా సంస్థ ద్వారా నగదు పురస్కారాలు అందించారు. ఇంటర్మీడియేట్‌లో పోతుల వరుణ్ సాయి 985 మార్కులు సాధించగా, పదోతరగతిలో కంచం ప్రవంతి 9.8 సాధించింది. దీంతో ఇరువురు విద్యార్థులకు రూ. 4వేల నగదు పురస్కారం అందించి శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. నాయకులు సామల మధుసూదన్, గుర్రం రవీందర్, తోట కుమారస్వామి, కట్ల మోహన్‌రెడ్డి, కృపా సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీలో సంస్థాగత నియామకాలు

హన్మకొండ : భారతీయ జనతా పార్టీలో సంస్థాగతంగా పలు నియామకాలు చేపట్టినట్లు హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా దాస్యం అభినవ్ భాస్కర్, నర్మెట్ట శ్రీనివాస్‌రావుగౌడ్, ఆకుల శ్రీకాంత్, కార్యదర్శులుగా మార్త రాజభద్రయ్య, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు. అలాగే బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సంద్ర మధు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మాలోతు తిరుపతినాయక్, 49వ డివిజన్ అధ్యక్షుడిగా సిరిపురం పవన్‌ను నియమించినట్లు వెల్లడించారు.

మిస్సింగ్ కేసు నమోదు



వేలేరు : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జోగు జ్యోతి భర్త లింగయ్య అనారోగ్యంతో కొన్ని నెలల క్రితం మృతిచెందాడు. ఇంటివద్ద ఒంటరిగా ఉంటుంది. దీంతో ఆమె ప్రతీరోజు భర్త గురించే ఆలోచిస్తూ మనోవేదనకు గురయ్యేది. ఈ క్రమంలో ఈనె11వ తేదీన జ్యోతి రెండో కూమార్తె అర్చన తల్లికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. వెంటనే ఆమె ఇంటికి వచ్చి చూడగా జ్యోతి కనిపించలేదు. దీంతో కూతురు అర్చన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

హన్మకొండ (పరకాల) : 2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం సమాజిక తనిఖీ ప్రజావేదికను శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండలంలో చేపట్టిన పనులపై 15వ విడత సామాజిక తనిఖీ బృందం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో తనిఖీ నిర్వహిస్తారని తెలిపారు.

బాధితుడికి పరామర్శ



ఐనవోలు : మండలంలోని నందనం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బుర్ర రాజశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు శుక్రవారం ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఆర్థికసాయం అందజేత



వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన జినుకల రాజకొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మదర్ థెరిస్సా ఫౌండేషన్ సభ్యులు రూ.3500 ఆర్థికసాయం అందించారు. అలాగే పైండ్ల రాకేశ్ రెడ్డి 25 కిలోల బియ్యం అందజేశారు. ఉపాధ్యక్షుడు రమేశ్, శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్‌కాలనీ రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు అన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ అసిస్టెంట్ సెక్రటరీ సత్యవరం వెంకటేశ్వర్లు (నేత) పుట్టినరోజు వేడుకలను అసోసియేషన్ అడ్డా వద్ద గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లును సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ రాజు, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసునూరి మనోహర్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఎస్.రామస్వామి, ఎస్.నర్సయ్య, నాయకులు ఇమ్మడి బాబు, సందెల విజయ్‌కుయార్, సత్యవరం మధుకర్, కాసర్ల నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసెకు మంటలు



హన్మకొండ (పరకాల) : ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి పూరిగుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన కామారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కొలుగూరి కుమారస్వామి కుటుంబ సభ్యులు కూలికి వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గుడిసెలో మంటలు వ్యాపించాయి. ఇంట్లో ఉన్న వస్తువులు, దుస్తులు, సర్టిఫికెట్స్ కాలపోయాయి. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ ఇంట్లో లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని బాధితుడు తెలిపాడు. గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ పరంగా సాయం అందిచేందుకు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కాగా అగ్ని ప్రమాదంలో బాధిత కుటుంబం సర్వం కోల్పోయింది.